1977 పింగళి సంవత్సర దీపావళి కథల పోటీలో రు. 600/- రెండవ బహుమతి పొందిన కథ

# "గవురిగా... ఒరేయ్ గవురిగా..." అంటూ పిలిచాడు... కాదు అరిచాడు దొర.

## "అత్తాన బాంచెను..."

ఎముకలపై ఆరవేయబడిన ఒంటిని మోస్తూ కర్రల్లాంటి రెండు కాళ్ళు నడిచివచ్చాయి.

"ఏంది బాంచెను" అంది ఎముకల గూడుమీది తల. ఏంది బాంచెను అనే తల+ఆ ఎముకలగూడు=గవురయ్య.

కాని, ఇప్పుడా ఎముకలగూడు, ఏంది బాంచెను అనే తల కలిస్తే గవురయ్య కాలేదు. "గవురిగాడు" అయింది.

దొరముందు "గవురిగాడు" నిలుచున్నాడు.

గవురయ్య ముందు "దొరగోరు" కూర్చొని ఉన్నారు.

దొర విలాసంగా కూర్చొని ఉన్నాడు.

గవురయ్య వణుకుతూ నిలుచున్నాడు.

దొరను, దొర కూర్చొన్న కుర్చీని భూమి మోస్తున్నది.

గవురయ్య కాళ్ళను అదే భూమి మోస్తున్నది.

దొర ఒంటిమీద పది మందికి సరిపోయే దుస్తులు, సంపద వున్నాయి.

ఉన్నదంతా పది మందికి దానం చేసిన వ్యక్తిలాగున్నాడు గవురయ్య. అతని మొలచుట్టూ చిరిగిన గుడ్డ పేలికలు మాత్రమే ఉన్నాయి.

దొరను మోస్తున్న కర్రకుర్చీకి, గవురయ్యను మోస్తున్న కర్రల్లాంటి కాళ్ళకు మధ్యనున్న దూరం వాళ్ళ వయసుల మధ్య లేదు.

దొరలో మంచితనం లాగే, ముసలితనం కూడా కనిపించడం లేదు.

దొర ముసలితనాన్ని కూడా తాను మోస్తున్నట్టు కనిపిస్తున్నాడు గవురయ్య.

"గవురిగా........ నువ్వు రేపు పొద్దుగాల్నె పట్నం బోవాలె" అన్నాడు దొర.

"అట్లనే- సినబాబుగోరి దగ్గరకా బాంచెను" అని అడిగాడు తలమీది రుమాలు తీసి చేతుల్లో పట్టుకొన్న గవురయ్య.

"ఆఁ.... అమ్మగారు మామిడికాయజాడి ఇస్తరు. భద్రంగా కొంటబోయి చినబాబుకు ఇచ్చిరా."

"అట్లనే కొంటబోతా...."

"అట్లనే గిట్లనేకాదు కాన జాగర్తగా కొంటబోవాలె-లేకపోతె నీ ఒళ్ళు పట్టున పగుల్తది-ఆఁ...."

మామిడికాయ జాడి ముందు మనిషి ఒళ్ళుకున్న విలువ ఎంతో వెళ్ళగక్కుతూ అన్నాడు దొర.

"పానంలాగ కొంటబోత దొరా" చేతుల్లో పట్టుకొన్న రుమాలులాగే నాలుకపై ప్రాణాన్ని నిలబెట్టి అన్నాడు గవురయ్య.

దొర పట్నం పొమ్మనగానే "తోక బస్సులు. రెండంత్రాల బస్సులు, మోటర్లు. టూరింగులు, పెద్దపెద్ద బంగులాలు" గవురయ్య కనులముందు మెదిలాయి. ఎప్పుడో పదేండ్ల క్రితం దొర తీసుకపోతే పట్నం వెళ్ళాడు గవురయ్య. మళ్ళా ఎన్నడూ పోలేదు, రాలేదు. పోవడానికి పట్నంలో తనకు ఎవరున్నారు? ఎవరూ లేరు. ఏం పని వుంది? ఏం పని లేదు. "అసలు పట్నం పోవాలంటే మాటలా? దానికి ఎంత నోచుకుని పుట్టాలె. ఎంత అదురుట్టం కావాలె" అనుకొనేవాడు గవురయ్య.

ఎవరైనా పట్నం పోతున్నానంటె వాళ్ళు ఆ "తోకబస్సులు, రెండంత్రాల బస్సులు ఎక్కినట్లు, పెద్ద పెద్ద బంగులాలకు పోతానట్లు అనుకొనేవాడు గవురయ్య.

రేపు తాను కూడా పట్నం వెళ్ళుతున్నాడు. ఏలభై, యాభై ఏళ్ళుగా అతడు పండించిన ధాన్యం పట్నం పోతున్నది గాని గవురయ్య ఒక్కసారె పట్నం వెళ్ళాడు ఇంత వరకు-

గవురయ్యకు ఆనందంగా వుంది.

అతని ఆనందానికి మరో కారణం కూడా ఉంది. ఎప్పుడో పదేండ్ల క్రితం అతడు పట్నం పోయినప్పుడు అందరూ త్రాగంగా మిగిలితే అతనికీ పోశారు. టీ "అబ్బ! అమురతం గిదే" అనుకున్నాడు గవురయ్య.

మరోసారి తాను ఆ అమృతాన్ని త్రాగబోతున్నందుకు గవురయ్యకు పరమానందంగా ఉంది.

ఆ రాత్రి గవురయ్య గుడిసె నిద్రపోలేదు.


"ఓయ్య నాకేమన్న కొనుక్కరాయె" అని సంటిది మరీ మరీ చెప్పింది.

"అట్లనే తెత్త బిడ్డ" అన్నాడు కూతురును దగ్గరికి తీసుకొంటూ గవురయ్య.

తెల్లవారగానే భద్రంగా చెక్కపెట్టె అడుగున దాచిన 'అంగీ' తీసి తొడుక్కొని దొరగారి మేడకు వెళ్ళాడు.

"వచ్చినావుర గవురిగా-" అన్నాడు దొర తన ముందు చేతులు కట్టుకొని నిలుచున్న గవురయ్యను చూసి.

"అచ్చిన బాంచెను."



దొరసానమ్మగారు పచ్చడిజాడిచూపిస్తూ "అరేయ్ జాగ్రత్తగా తీసకపో" అన్నారు.

"జాగర తగానే తీస్కపోతానమ్మగోరూ- సినబాబుగోరికి మాయిడికాయ తొక్కంటే చాన ఇట్టం- గింత ఇటమైంది నా పానంలాగ తీస్కపోనూ-" అన్నాడు గవురయ్య పచ్చడి జాడీ తీసుకొంటూ.

"ఇంగో ఈ రెండు రూపాలు బస్సు కిరాయికి- వచ్చేటప్పుడు బాబు నడుకొ్క- లేకపోతె నడిచిరా" అన్నాడు దొర 'అడుక్కోవడానికే పుట్టినవురా' అన్నట్టు గవురయ్యను చూస్తూ-

"ఇంగో అడ్రసు చీటి- బస్సు డిపోలో

బస్సు దిగంగనే ఎవరికన్న ఈ చీటీ చూపించు- యిల్లు చూయిస్తరు " అన్నాడు దొర గవురయ్యకు చీటీ యిస్తూ.

అన్నింటికి తలూపి జాడీని ఎత్తుకొని బయలుదేరాడు గవురయ్య.

ఆ ఊరికి బస్సురాదు. ఎలా వస్తుంది? అదేమన్న మనిషా?

బురదలోనుంచి, ముండ్ల కంపల్లోంచి రాళ్ళలోనుంచి రావడానికి!

దానికి నున్నటి. అందమైన రోడ్డుకావాలి. గుచ్చుకొంటె రక్తం కారకపోయినా. ఆ రోడ్డుమీద ముండ్లుగాని. గులకరాళ్ళుగాని ఉండడానికి వీలులెదు. అప్పుడు దానికిష్ట మైతే. రమ్మని పిలవ వలసినవాళ్ళు పిలిస్తే పంపవలసినవాళ్ళు పంపితె వస్తుంది. పోతుంది.

ఆ ఊరికి రోడ్డులెదు.

"ఊరికి రోడ్డు పడితే పట్నంకు దారి పడ్డట్టేకదా- పట్నంకు దారిపడితె ఇంకే మన్న వుందా- ఈ పల్లెటూరోళ్ళ కండ్లు నెత్తికెక్కవూ! అప్పుడు ఈ గవురయ్య సొంటోడు మన పొలంల పనిచేయడానిక ఎత్తారు? పట్నం పనులకే పోతనంటరు- పట్నం మాటలు నేర్చి మనలను ఖాతరు చెయరు" అనేది దొరల ఆలోచన. ఇది వాళ్ళ మనసుల లోపలి ఆలోచన. బయటికి చెప్పే జవాబులు వేరే వుంటాయి. గవురయ్య లాంటి రైతు కూలీలే వాళ్ళ పొలాలకు కావాలి వాళ్ళ చెమట బిందువులె దొరల సంపదకు పెట్టుబడులు.


ఇదంతా గవురయ్య ఆలోచించడం లేదు.

తమ ఊరికి రోడ్డు లెదు గనుక. బస్సు రాదు అనుకొంటున్నాడు.

అయితే "రోడ్డు ఎందుకు లేదు?" అనే ప్రశ్న అతనిలో ఉదయించాలంటె అతడు మరికొన్ని జన్మలెత్తాలి.

జాడీని భుజం మీద పెట్టుకొని నడుస్తు న్నాడు గవురయ్య.

అలా అనేకంటే గవురయ్య భుజం మీద కూర్చొని జాడీ వెళ్తున్న దనవచ్చు.



# సదానంద్ శారద

# జాడి

రెండు మూడు మైళ్ళు వెళ్తేగాని బస్సులు నడిచే రోడ్డు రాదు.

వెళ్తున్న గవురయ్య ఆగాడు.

నోరులెదుగాని లేకపోతే ఆ జాడీకూడా దొరగారిలా. దొరగారి భార్యలా. దొరగారి కొడుకులా. దొరగారి కోడలులా. దొరగారి కూతురులా. దొరగారి అల్లుడిలా "ఏమ యిందిరా గవురిగా' అని అడిగేదే!

చెప్పులులేని గవురయ్య కాలికి ముల్లు గుచ్చుకొంది.

తలమీది రుమాలుతీసి నేలమీదబెట్టి, దానిమీద జాడీ గారిని కూర్చొబెట్టి తాను

క్రింద కూర్చొని గట్టిగా ముళ్ళను లాగే వాడు గవురయ్య. రక్తం కొంచెం కొంచెమే పైకి వచ్చింది గట్టిగా పిండితే- ఆ రక్తాన్ని తుడిచి, తిరిగి జాడీని భుజం మీద ఎత్తుకుని నడవసాగాడు గవురయ్య.

తిరిగి గవురయ్య భుజంమీద కూర్చొని వెళ్తున్నది జాడీ.

కొంత దూరం వెళ్ళేసరికి వాగు అడ్డు వచ్చింది.

దొరగారి జాడీ. లేక జాడీ దొరగారు వచ్చారని దానికి తెలియదు కాబోలు ఉధృతంగా ప్రవహిస్తోంది.

ఆ వాగులోకి దిగి మెల్ల మెల్లగా అడుగులో అడుగు వేసుకొంటూ ఆవలి ఒడ్డుకు చేరాడు గవురయ్య. జాడీగారిని ఒడ్డుమీద పెట్టి తాను మీదికి ఎక్కబోయాడు.

కాలు జారింది.... అంగీ, ధోవతినిండా బురద మరకలు అంటుకొన్నాయి. కాలి మంట సరేసరి:

పేదవాళ్ళని ఏడిపించడానికి మనుషులతో పాటు ప్రకృతికి సరదాయే కాబోలు!

అయినా జాడీకి జరిగే ప్రమాదంలో ఏ లోపమూ రానివ్వలేదు గవురయ్య. బట్టలనిండా బురద మరకలు అంటినా, అరికాలు నొప్పెడుతున్నా జాడీని భుజం మీద ఎత్తుకొని నడుస్తూనే వున్నాడు.

పల్లకిలో కూర్చొన్న పెళ్ళికూతురులా ఠీవిగా గవురయ్య భుజంమీద కూర్చొని వెడుతోంది జాడీ.

బస్సులు నడిచే రోడ్డు వచ్చింది.

అప్పటికే ఎన్నో కాళ్ళు అక్కడికి నడిచి వచ్చాయి. ఎన్నో మూటలు మనుషుల మీద ఎక్కివచ్చాయి. ఎన్నో అవసరాలు బస్సుల కోసం ఎదురు చూస్తున్నాయి. కొత్తగా వచ్చే మూటలను, మనుషులను కోపంగా చూస్తున్నాయి కొన్ని చూపులు.

ఆ ప్రదేశంలో రోడ్డు కిరువైపులా చాలా బిజీగా, సందడిగా వుంది. రోడ్డు మాత్రం మహారాజుగారి కోసం పరిచివున్న తివాచీలా నీటుగా, అందంగా వుంది.

అప్పుడప్పుడు అటువైపునుంచి ఇటువైపు నుంచి వాహనాలు వేగంగా వస్తున్నాయి, అక్కడేదో అంటురోగాల మనుషులున్నట్టు ఆగితే తమకా రోగం అంటుకొంటుందన్నట్టు హడావిడిగా వెళ్ళిపోతున్నాయి.

ఎప్పుడో- అరగంటకో. గంటకో దూరంగా బస్సు శబ్దం వినిపించడం రోడ్డు

---

ఈ పేరులోని అర్ధభాగం అర్ధభాగం మీరు మొదటి సారిగా ఈపేరే పిల్చింది విదేశీ పాలన తొలగిన నాల్గు సంవత్సరాలకు.



వరంగల్, హైద్రాబాద్- ఈ రెండు చారిత్రక పట్టణాలలో మొదటిది జన్మనిస్తే, రెండవది బ్రతుకునిస్తున్నది.

"ఈ విశేష రచన చదువుతుంటే బాధ. అప్పుడప్పుడు ఆనందం కలుగుతుంటాయి. ఈ బాధలను, అందులో కొన్నింటికైనా పరిష్కార మార్గాలను చూపించ గలిగితే, ఈ ఆనందాలను విప్పి చెప్ప గలిగితే ఈ గ్రంథంలోని ఒక పుటలో నా పాత్ర అభినయం పూర్తవుతుంది."

—సదానంద్ శారద

---

కిరువక్కల కూర్చున్న అవసరాల గుండెల్లో ఆశలు చిగురించడం. మూటల్లు భుజాల మీదికి లేవడం. కళ్ళల్లోకి కాంతులు చేరడం....అంతలో వచ్చిన ఆ బస్సు వాళ్ళ కళ్ళల్లో దుమ్ముకొట్టి ఆగకుండా వెళ్ళిపోవడం అప్పటికి ఎన్నోసార్లు జరిగింది. అవి నడిపే వాళ్ళకు ప్రజల కళ్ళల్లో దుమ్ము కొట్టడం ఒక్కటే బాగా తెలిసినట్టుంది.

అందరితోపాటు గవురయ్యకూడా బస్సు కోసం చూస్తున్నాడు. ఒక్క బస్సుకూడా ఆగడంలేదు. దాదాపు మధ్యాహ్నం దాటిపోయింది.

"బస్సెక్కక చాన రోజులయింది" అనుకొన్నాడు గవురయ్య. ఈ రోజు బస్సు ఎక్కబోతున్నందుకు అతనికి ఆనందంగానే వుందని చెప్పాలి, కాని బస్సు ఎక్కడమెట్లా? ప్రజలు అందుకు డబ్బు ఇస్తున్నా, ప్రజాసేవకోసం అవి నడుస్తున్నా అవి అందరు ఎక్కడానికి లేవు. అందరినీ ఎక్కనివ్వరు.

"ఒరినీ గీ బస్సు సెంగతి ఇట్లాయెను! రెండు జాములు దాటె- ఎట్ల? పట్నం ఎట బోను- నడిచిపోయినా ఈ పాటికి పట్నంల పడుతును- అదేపాయె కూసో కున్నా నిలబడ్డను గద- ఆ బస్సుల ఎక్కనిస్తేనే లేరు- అసలు ఆపుతనే లేరు. కలిగినోల జెనం ఎక్కువై పోయిండ్లు- ఎట్ల- అపేది నడుద్దునా- మొగులు కమ్ము కొత్తాంది గదా-" అనుకొంటున్నాడు గవురయ్య.

అంతలో ఒక బస్సు వచ్చింది. దిగాల్సిన వాళ్ళు ఎవరో వున్నట్టున్నారు. స్టేజీ మీద కాకపోయినప్పటికి కొంచెం ముందుకు పోయి అర్థంకాని భాషలో జనాన్ని తిట్టుకొంటూ ఆగింది బస్సు.

"పైసా" ధర్మం చేసే ధర్మాత్ముల చుట్టూ మూగిన బిచ్చగాండ్లలా ఆ బస్సును చుట్టేశారు జనం. ఒకరి మీద ఒకరు పడుతూ, నెట్టుకొంటూ తిట్టుకొంటూ, తొక్కుకొంటూ ఎక్కడానికి ప్రయత్నం చేస్తున్నారు.

గవురయ్య కూడా ఆ గుంపులో చేరాడు. ఎవరో వెనకనుంచి నెట్టుతే పోయి బస్సు మెట్ల మీద కుస్తీపడుతున్న వాళ్ళ మీద పడ్డాడు.

"ఏయ్ ముసలోడా కండ్లెక్కుకలేవ్? ఆ జాడీ పగిలి పోతది దిగు" అంటున్నారు ఎవరో.

"అమ్మో జాడి!" అనుకొని జాడీని గట్టిగా పట్టుకొన్నాడు గవురయ్య. ఆ తొక్కిడిలో ఎవరో గవురయ్య తలమీది రుమాలును లాగేశారు. అది బస్సు ఎక్కుతున్న ఒకాయన భుజంమీద పడింది. అతను అలాగే బస్సు ఎక్కేశాడు. అంతలోనే కండక్టరు తలుపు వేశాడు. బరబర నల్లటి పొగను వదిలిపెట్టి జనాన్ని అందులోకి తోసివేసి వెళ్ళిపోయింది బస్సు. ఓడిపోయిన జనంలో ఒకడై విచారంగా ఆ బస్సు వెళ్ళిన వైపే చూస్తూ నిలుచున్నాడు గవురయ్య.

అతని తలమీద ఇప్పుడు రుమాలులేదు. అది బస్సులో ఈ పాటికి ఎవరి కాళ్ళ క్రిందనో నలుగుతున్నది.

జాడీమాత్రం అతని భుజాలమీద సురక్షితంగా వుంది.

గవురయ్యకు కోపం రాలేదు. గవురయ్యకు కోపంరాదు. గవురయ్యలాంటి వాళ్ళకు లేని వాటిల్లో కోపం ఒకటి.

"ఇగ లాభంలేదు- నడిచేపోత. అయినా దేవుడిచ్చిన కాల్లున్నంక బస్సు ఎక్కకుంటె ఏం బాయె! దొరోరు ఇచ్చిన

రెండు రూపాయలు పెట్టి సంచిదాని కేమన్న కొనక్కపోత" అనుకొని తలవంచుకొని రోడ్డువెంట నడుస్తున్నాడు గవురయ్య.

గవురయ్య తలవంచి అతని భుజంమీద కూర్చొని రోడ్డువెంట సాగిపోతున్నది జాడీ.

గవురయ్యతాత దొర తాతదగ్గర గవురయ్య తండ్రి దొర తండ్రి దగ్గర, దగ్గర కాదు క్రింద పని చేశాడు. గవురయ్య దొరకింద పని చేస్తున్నాడు. తన కొడుకులు, బిడ్డలకంటె ఎక్కువగా దొర కొడుకులను, బిడ్డలను ఎత్తుకొన్నాడు. వాళ్ళ ధాన్యం బస్తాలు మోశాడు. వాళ్ళ సామాన్లు మోశాడు. వాళ్ళ పచ్చడి జాడీని మోస్తున్నాడు.

టపటపా చినుకులు రాలసాగాయి త్వరలోనే అది పెద్ద వానగా మారిపోయింది.

గవురయ్య తడిసిపోతున్నాడు.

జాడి తడిసిపోతున్న దనుకొంటున్నాడు. గబగబా ఒంటిమీది అంగి విప్పి జాడీ చుట్టూ చుట్టాడు. ఆకాశం జాలిగా నవ్వుతున్నది. చెమటతో తడిసిపోయే అతని శరీరాన్ని వర్షం తడిమి చూస్తున్నది. చలి అతని ఎముకలను కొరుక్కొని తింటున్నది

కొంచెంసేపు ఒక చెట్టుక్రింద నిలుచున్నాడు.

అతని ఆలోచనంతా జాడీమీదే ఉంది.

"లోపలికి నీళ్ళు పోతానయా? తొక్కు ఏమైతదో ఏమో!" అనుకొంటూ దాని చుట్టూ చుట్టిన 'అంగిని' సరిగా ఉందో లేదోనని మాటిమాటికి పరిశీలించసాగాడు. అతడు అనవసరంగా గాభరాపడుతున్నాడే కాని, జాడీలోకి నీళ్లు పోయే అవకాశం లేదు. దాని మూతి గట్టిగా బిగించి ఉంది. దాని చుట్టూ గుడ్డ చుట్టి ఇచ్చింది దొరసాని.

అయినా అతని భయం అతనిది, అతని దిగులు అతనిది. "వానాగి పోవాలె- వానాగి పోవాలె దేవుడా బాంచెను" అనుకోసాగాడు, తాను తడిసిపోతున్నందుకు కాదు- తనకు చలివేస్తున్నందుకు కాదు. జాడీ తడిసి పోతుందేమోనని, అందలి పచ్చడి చెడిపోతుందేమోనని.

అవకాశం ఉంటే తన చర్మాన్ని ఒలిచి ఆ జాడీ చుట్టు చుట్టేవాడే గవురయ్య. కాని కనీసం అదొక్కటైనా అతనినుంచి వేరు చేసే వీలు లేకుండాచేసి ఒక మంచిపని చేసింది ప్రకృతి.

వర్షం కొంచెం తెరిపి నిచ్చింది.



అందానికి అందం సత్యప్రియ

గవురయ్య తిరిగి రోడ్డువెంట నడవ సాగాడు.

అతను నడుస్తూనే ఉన్నాడు. బస్సులు, కార్లు, స్కూటర్లు, ఎన్నో అతన్ని దాటేసి పోతున్నాయి.

సాయంకాలం అయింది.

పేదవాని ఆశల్లాగ దూరంగా పట్నం లోని విద్యుద్దీపాలు మినుకు మినుకున వెలుగుతున్నాయి. మలిగి పోతున్నాయి.

గవురయ్య దీక్షగా నడుస్తున్నాడు. పట్నం పొలిమేరలోకి వచ్చాడు. అక్కడ ఒక్కసారే నాలుగైదు రోడ్లు కనిపించే సరికి ఏ రోడ్డు వెంట పోవాలో తెలియక అతని కాళ్ళు ఆగిపోయాయి.

రోడ్డు ఒక్కటైనంత సేపు అతనికి ఆలోచించే అవసరం కలగలేదు.

ఇప్పుడు ఏ రోడ్డువెంట పోవాలి?

దొర ఇచ్చిన చిట్టీ గుర్తుకు వచ్చింది. జాడీ చుట్టూ చుట్టిన అంగి జేబులు తడిమి చూశాడు, దొర ఇచ్చిన చిట్టీ దొరికింది.

"అమ్మయ్య" అనుకొన్నాడు గవురయ్య.

ఆ తరువాత గుర్తుకు వచ్చింది, 'అంగిల రెండు రూపాయలు ఉండాలెగదా' అనుకొని మరోసారి జేబులు తడిమి చూశాడు. కాని అవి లేవు. చిట్టీ మాత్రమే కనిపిస్తున్నది గాని 'రూపాయలు' లేవు.

"అయ్యో! సంచిదాని కేమన్న కొనక్కపోత ననుకొంటె ఎట్లాయె" అనుకొన్నాడు.

ఆ రెండు రూపాయలు ఎక్కడ పడి పోయాయో కాని 'సంచిడని కేమన్న కొన్కపోవాలె' అన్న ఆలోచన మాత్రం అక్కడ పడిపోయింది.

ఆ ఉద్దేశాన్ని అక్కడ వదిలేసి ముందుకు నడిచి ఒకతన్ని అడిగాడు– 'బస్సు డిపో కెట్ల బోవాల్నయ్యా–' అని.

అతడు జవాబు చెప్పడం ఏమోగాని కనీసం గవురయ్యా ముఖమైనా చూడకుండా వెళ్ళిపోయాడు.

పాపం! గవురయ్యా ఎటుపోవాలో తెలియక అక్కడే కొంచెంసేపు నిలుచున్నాడు.

అటు వేపుగా పోతున్న మరో అతన్ని "అయ్యా ఆగుండ్రి బాంచెను" అంటూ ఆపాడు.

"ఏం కావాల్రా?" అన్నాడా వ్యక్తి దొరగారి బ్రదర్‌లా మండిపడుతూ.

గవురయ్యా అడుగుతున్నదేదో వినకుండానే "పై సల్లేవు పో" అంటూ వెళ్ళిపోయాడు.

మరింత నివ్వెరపోయాడు గవురయ్యా.

"టూరింగులు, లోకబస్సులు. పెద్దపెద్ద బంగులాలు మా బాగనే ఉన్నాయిగాని ఈ మన్సులు గిట్ల జూడబట్టిరి" అనుకొన్నాడు.

ఇంకొంచెం ముందుకు పోయి–"అయ్యా సలాంజేత్త – బస్సు డిపో కెట్ల బోవాలె చెప్పుండ్రి" అని అడిగాడు ఒక వ్యక్తిని.

"ఇదర్ సే సీదా జావ్" అన్నాడా వ్యక్తి ఒక రోడ్డు చూపిస్తూ. ఆ భాష అర్థం కాకున్నా అతడు చూపించిన రోడ్డు వెంట నడవసాగాడు గవురయ్యా.

కొంత దూరం వెళ్ళగానే మరో నాలుగైదు రోడ్లు వచ్చాయి. "టూరింగులు, బస్సులు, అంతరాల బస్సులు. సైకోళ్ళు. డుగ్ డుగ్ మోటార్లు.. జనం.... లొల్లి.... బొబ్బ. ఏం బొబ్బ ఇది–పట్నం కాన మారి పోయింది. ఆ నడుంగుల ఆదేంది!–ఎలుగి తాంది పలుగుతాంది. ఈల్లు ఆగు తాండ్లు ఆల్లు పోతాండ్లు. బస్సు డిపో కెట్ల బోవాల్నో గద– బస్సు డిపూదగ్గర్నె సిన బాబుగోరుండే ఇల్లు అని చెప్పిండ్లు.. ఎట్ల బోరు." అని చౌరస్తాకు దూరంగా నిలబడి ఆలోచిస్తున్నాడు గవురయ్యా. ఒక ప్రక్కన కొంతమంది యువకులు నిలుచొని వున్నారు. వాళ్ళ దగ్గరికి వెళ్ళి– "బస్సు డిపో కెట్ల బోవాలె బాంచెను" అని అడిగాడు.

వాళ్ళు ఎగాదిగా గవురయ్యా వైపు ఒకసారి చూశారు. అప్పుడు "గవురయ్యా" అనే చిత్రం ఇలా గుండని చెప్పవచ్చు.

లోతుకు పోయిన గుంటల్లాంటి కళ్ళు ఎముకలపై ఆరవేయబడిన ఒళ్ళు చంకలో అంగి, భుజంమీద జాడీ, మోకాళ్ళ మీదికి ఎగదోపి కట్టిన ముతక దోవతి, దానిండా బురద మరకలు.

"అరె గాంవాలా రే" అన్నాడొక యువకుడు.

"దేఖోరె ఏగాంవాలం కె సాహై" అని వింగబడి నవ్వుతున్నారు వాళ్ళు.

ఆ నవ్వే శక్తి "గాంవాలా" పెట్టిన తిండి వల్లనే వచ్చిందని వాళ్ళకుతెలియదు.

## జ్యోతి

మేను
మరిగినా
కరిగినా
కన్నీళ్ళు
కాగినా
కారినా
గుండెలో
మంటలు
నిండినా
మండినా
మంటల్లో
గుండెను
పండినా
పిండినా
ఒత్తిని
రాల్చినా
రాల్చినా
చిరునవ్వులతో
కిరణాల జల్లు
వెదజల్లుతుంది
జ్యోతి

—చిలకా ఎబెనెజర్ మోజస్







వాళ్ళెందుకు నవ్వుతున్నారో గవురయ్యకు అర్థంకాలేదు.

దీనంగా వాళ్ళవేపు చూడసాగాడు.

ఆ భావి దేశనాయకులు విరగబడి నవ్వుతూనే ఉన్నారు.

దేశపు వెన్నెముక వాళ్ళముందు దీనంగా నిలబడింది.

"బస్సుడిపోకు పోవాలె? ఎట్ల బోవాలె జెర చెప్పుండ్లి బాంచెను" అని తిరిగి అడిగాడు గవురయ్య.

"బస్సు డిపోకు పోతవ్?........ఆ జాడి ఇయ్యి చెప్తం" అన్నాడొక యువకుడు. అతని తల నున్నగా దువ్వి ఉంది. అతని ఒంటికి విలువైన దుస్తులు వ్రేలాడుతున్నాయి.

"జాడిలో ఏముంది బే" అంటూ దగ్గరగా వచ్చాడు ఒక యువకుడు.

"ఆ అంగి ఇస్తవు చెప్తం" అంటూ చేతికి కడెం ఉన్న ఒక యువకుడు గవురయ్య చంకలోని అంగిని లాక్కొన్నాడు. బహుశ ఈ ఘనకార్యాలు చేయడానికే కాబోలు అతడు చేతికి కడెం వేసుకొన్నాడు కంకణం కట్టుకున్నట్టు.

మరో యువకుడు ఆ అంగీని కడెం చేతిలోంచి లాక్కొని రోడ్డు మీదికి విసిరేశాడు.

"అయ్యో- ఎందుల్ల గిట్ల జేస్తాండ్లు మిమ్ముల్ను దారి అడుగుతాను అంతేగాదు బాంచెను." అంటూ ఆ అంగీని తీసుకోబోయాడు గవురయ్య.

ఓ సైకిలు చక్రం వచ్చి అతని కాలికి తాకింది.

"ఏందిరా నడి రోడ్డు మీద- కండ్లు కనవడుతలేవా?" అన్నాడు ఆ సైకిలు తోసే మనిషి.

"కాదు బాంచెను. నా అంగీని ఈడ పడేసిండ్లు-తీసుకొంటాన" జాలిగా ముఖం పెట్టి అన్నాడు గవురయ్య.

"ఆ సారే పక్కకు పో" అంటున్న ఆ మనిషిని సైకిలు అక్కడినుంచి తోసుక పోయింది.

ఆ మనిషిని సైకిలు తోసుకపోయాక బృందంలోని ఒక యువకుడు గవురయ్యను ఇలా అడిగాడు ఏమీ ఎరుగనట్లు.

"ఎటుబోవాలె పటేలా?"

"బస్సుడిపూ...." మళ్ళీ ఏం చేస్తారోనని భయం భయంగా చూస్తూ అన్నాడు గవురయ్య.



"పట్నవాసం"లో కృష్ణ, నాగభూషణం, రాధాకుమారి

"బస్సుల డిపోకు పోతవ్.... ఇటు ప్రక్క రోడ్డుంది చూడు- ఆ రోడ్డు వెంట చక్కగ పో బస్సుల డిపో వస్తది."

"చక్కగబో- రోడ్డు విడిచిపెట్టేవు" అన్నారు కడెం, నున్నటి తల.

గవురయ్య తల వంచుకొని వాళ్ళు చూపించిన రోడ్డు వెంట నడవసాగాడు.

నడక.. నడక.. ప్రొద్దటి నుంచి ఒకటె నడక- నడిచి నడిచి కాళ్ళు నొప్పెడుతున్నాయి.

ఒంట్లో వొణుకు ప్రారంభం అయింది. జ్వరం జ్వరంగా ఉంది. ఆకలి బాగా వేస్తోంది. ప్రొద్దటినుంచి అన్నంలేదు.

చాలా దూరం నడిచాడు. శక్తినంత కూడదీసుకొని నడవ సాగాడు. జాడీని మోస్తూ నడవసాగాడు. ఎంతకూ బస్సు డిపోరాదు! నడిచి నడిచి శోష వచ్చింది గవురయ్యకు. ఇక నడవలేక ఆగి.... "బస్సుడిపోకు ఎంతదూరం పోవాలె?" అని అడిగాడు ఒకతన్ని. అతను గవురయ్యవైపు ఆశ్చర్యంగా చూసి.

"ఇటు బస్సుడిపో ఎక్కడిది! ఇట్లనే వెనకకు నడిచిపో చౌరాస్తా వస్తది. ఎడమ వైపు రోడ్డు వెంబడి పో-దగ్గరలోనే ఉంది బస్సుడిపో" అని చెప్పాడు.

వచ్చిన దారి వెంటనే వెనకకు తిరిగి నడవసాగాడు గవురయ్య. ఇప్పుడతనికి ఏ "మూరింగులు, మోటర్లు, బంగులాలు" కనిపించడంలేదు. తిరిగి చౌరస్తా దగ్గరికి వచ్చాడు. ఆ యువక బృందం అతన్ని చూసి విరగబడి నవ్వసాగింది. పైసా ఖర్చు లేకుండా బోలెడు వినోదం లభించింది వాళ్ళకు. "డిపో చూసి వస్తివా పటేలా?" అంటూ బృందం నుంచి ఒకడు అడిగాడు. గవురయ్య వాళ్ళవైపు బాధగా చూశాడు. అతనికి దుఃఖం వస్తున్నది.

అతడు పల్లెటూరు మనిషి. నిజమే!- మన దేశంలో డెబ్భైయి శాతం మంది పల్లెటూరి మనుషులే. వాళ్ళంతా ఒక్కసారి గిరిస్తె ఈ నున్నటి తలలు ఎగిరిపోవా? కడెంలు ఊడిపడవా?

గవురయ్య మారుమాట్లాడకుండా, వాళ్ళ మాటలు పట్టించుకోకుండా తల వంచుకొని బస్సు డిపోకు వెళ్ళే రోడ్డు వెంట నడవ సాగాడు.

బస్సు డిపో చేరుకొని ఒకతనికి ఉత్తరము చిట్టి చూపించాడు. అందులో- "చంద్రశేఖర్, గౌలిగూడ" అనే మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇంటి నెంబరు తడిసిపోవడం వలన సరిగా కనిపించడం లేదు. "గౌలిగూడ అయితె ఇదేకాని ఇంటి నంబరు లేకుండా ఇల్లు ఎక్కడని వెదుకుతవ్?" అని అడిగాడా వ్యక్తి. "బాంచెను గులాపోన్ని తవరే చెప్పాలె. ఎట్ల దొర్కుతది ఇల్లు" అని బ్రతిమిలాడాడు గవురయ్య.

"ఈ చంద్రశేఖర్ ఎవరు?" అని ప్రశ్నించాడావ్యక్తి. "మా సినబాబుగోరు దొరా...." అన్నాడు గవురయ్య అమాయకంగా. "అబ్బబ్బ అది కాదయ్యా-అతడేం పని చేస్తాడు?" తిరిగి ప్రశ్నించాడావ్యక్తి. "అదేందో ఆపీసుల...." అన్నాడు గవురయ్య.

"అదికూడా తెలియకపోతే ఎలా దొరుకుతుందయ్యా ఇల్లు?"

"మరి ఎట్ల బాంచెను!"

"ఈ చుట్టుప్రక్కల అడిగిచూడు" అంటూ చిట్టీనిగవురయ్య చేతికిచ్చి ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు. అడుక్కుంటూ అడుక్కుంటూ దాదాపు గంటసేపు తిరిగిన తరువాతగాని ఆ ఇల్లు దొరకలేదు గవురయ్యకు. ఆ ఇంటి ముందు గదిలో ఎవరెవరో కూర్చొని వున్నారు. వాళ్ళలో చంద్రశేఖర్‌ను (చిన్న దొరను) గుర్తుపట్టి బయటే నిలుచున్నాడు గవురయ్య. గవురయ్యను చూసి చిన్న దొర బయటికి వచ్చాడు. "దండాలు బాబుగోరూ" అన్నాడు గవురయ్య ఎంతో సంబరంగా. కాని, చిన్న దొర ముఖం చిట్లించుకుని నౌకరుని పిలిచి "వీణ్ణి అటు తీసుకపోయి ఏం కావాలో అడుగు-" అని చెప్పి లోనికి వెళ్ళిపోయాడు.

"హూ ఈజ్ హి?" అని ఎవరూ అడగక ముందే "ఎవడో బెగ్గర్" అంటూ ఆ గదిలోని వాళ్ళతో తిరిగి కబుర్లలోకి దిగాడు చంద్రశేఖర్.

ఎముకల గూడు, ఏంది బాంచెను అనే తల ఇపుడు కనీసం "గవురిగాడు" కూడా కాదు.... బెగర్!!! ఆ బెగ్గర్ వాళ్ళ పచ్చడి జాడీని మోస్తూ ఇరవై మైళ్ళు నడిచి వచ్చాడు. ఆ బెగరే బస్తాల కొద్దీ ధాన్యం పండించి వాళ్ళకు ఇస్తున్నాడు. ఆ ధాన్యమే వాళ్ళకు డబ్బును, సుఖాలను ఇస్తున్నది. ఆ ధాన్యమే పట్టణాలకు తిండి పెడుతున్నది. ఫ్యాక్టరీలను నడుపుతున్నది.

గవురయ్యను ఇంటి వెనకకు తీసుకపోయాడు నౌకరు. అక్కడికి చిన్నదొర భార్య చిన్న దొరసాని వచ్చింది. ఆమెను చూసి "దండాలమ్మగోరూ-నేను గవిరిగాన్ని. తవరికి మాడికాయతొక్కు ఇట్టమని దొరసానమ్మగోరు బంపింల్లు" అంటూ జాడీ (గారి)ని భుజం మీదినుంచి దించాడు గవురయ్య. "అది లోపలపెట్టు" అని పట్నం నౌకరుకు చెప్పింది చినదొరసాని. "మామగారు, అత్తగారు బాగున్నారా?" అని అడిగింది.



'చల్ మోహన రంగ' లో మోహన్‌బాబు, జానకి, దీప

"బాగున్నరండి. తవర్ని, సినబాబు గోర్ని వూకె గ్యాపకం జేతరు" అన్నాడు గవురయ్య చేతులు కట్టుకొని నిలబడి. ఆ చిన్న దొరసాని ఇక మాట్లాడ లేదు. "వుండరా" అనలేదు. "పోరా" అనలేదు. లోపలికి వెళ్ళిపోయింది.

పావుగంట అయింది. అర్ధగంట అయింది గంట అయింది!!

అలాగే నిలుచున్నాడు గవురయ్య. అతన్ని ఉండమన్న వాళ్ళులేరు, పొమ్మన్న వాళ్ళు లేరు.

అతనిమీద ఎక్కివచ్చిన జాడిమాత్రం లోనికివెళ్ళి హాయిగా, వెచ్చగా పేదదీర్చుకుంటున్నది. పల్లకీ దించిన బోయిలా బయటే నిలుచున్నాడు గవురయ్య చలిలో-అతని కడుపు ఆకలితో మండిపోతున్నది. నడిచి నడిచి కాళ్ళు పీక్కుపోతున్నాయి. మోసి మోసి భుజాలు నొప్పెడుతున్నాయి. ఒళ్ళంతా చల్లబడింది. కళ్ళకు చీకట్లు క్రమ్ముతున్నాయి. చలితో వణికిపోతున్నాడు.

ఏదో పనిమీద బయటికి వచ్చి "ఇంకా ఇక్కడే ఉన్నవేంరా? పోలేదూ? బస్సు వెళ్ళిపోతుంది కదూ. నువ్వు ఇంకా ఇక్కడే ఉంటె అక్కడి పనెవరు చేస్తరు? లాస్ట్ బస్సుకు వెళ్ళిపో." అంది దొరగారి కోడలు, చిన్న దొరగారి భార్య, చిన్న దొరసాని. గవురయ్య నోట మాట రాలేదు. అతని చేతిలో చిల్లిగవ్వలేదు. ఒంట్లో నడిచే చేవలేదు. కడుపులో ఆకలి వుంది. ఒంటి నిండా బట్ట లేదు. లేనిది "లేదు" అని, ఉన్నది "ఉంది" అని చెప్పుకోలేడు గవురయ్య. అతనికి లేనిది ఉందని, ఉన్నది లేదని అనుకోవడమే ఎదుటి వారికి అలవాటు.

"పోతాన బాంచెను...." అంటూ రెండడుగులు వేశాడు. కాని, ఎక్కడికి వెళ్తాడు? - లాస్ట్ బస్సుకు పోవడానికి డబ్బుల్లేవు. ఆ రాత్రికి ఏ అరుగుమీదో పడుకొని మరునాడు ప్రొద్దున నడిచి పోవాలి. అతన్ని మోస్తూ రెండడుగులు వేసి ఆగాయి కాళ్ళు! కళ్ళకు చీకటి వస్తున్నది. ఒళ్ళంతా వణికిపోతున్నది.

అడగలేక అడగలేక నోరువిడిచి అడిగాడు గవురయ్య- "ఆకలైతాంది అమ్మగోరూ.... బుక్కెడు బువ్వ ఎయ్యరాదుండ్లి బాంచెను."

ఇరవై మైళ్ళు వాళ్ళ పచ్చడి జాడీ మోస్తూ నడిచి వచ్చిన గవురయ్య. తాను వానలో తడిసిపోతున్నా, చలిలో వణికిపోతున్నా జాడీకి మాత్రం తన అంగీ కప్పి భద్రంగా తెసుకొచ్చిన గవురయ్య ఏటేటా వాళ్ళకు ధాన్యరాశుల పండించే గవురయ్య అడిగింది బుక్కెడు బువ్వ'.

"బువ్వా?- బువ్వలేదు గివ్వలేదు పోరా- అవతల మాకే గెస్టు వచ్చింల్లు" అంటూ గభాల్న తలుపులు వేసుకొంది చిన్న దొరసాని.

మళ్ళీ వర్షం వచ్చేలా వుంది.

ఆ తలుపుల వెనకనున్న వర్గాన్ని చూస్తూ ఆకాశం గట్టిగా ఉరిమింది. ★